క్లుప్తంగా

ఎంఎస్‌ఎంఈ పరీక్షల్లో గొడిచర్ల విద్యార్థిని ప్రతిభ



ప్రతిభ కనపరచిన విజయస్వాతి

నక్కపల్లి : గత ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గంగిరెడ్డి విజయస్వాతి ప్రతిభ కనపరచి మండలంలోనే నగదు పురస్కారానికి ఎంపికయింది. జగన్నాథపురానికి చెందిన స్వాతి తొమ్మిదో తరగతి చదువుతోంది. నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కొరకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనపరచిందన్నారు. మండలంలో ఎంపికైన ఏకైక విద్యార్థిగా నిలిచిందని ఉపాధ్యాయులు తెలిపారు. స్కాలర్‌షిప్ కోసం ఎంపికైన స్వాతిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పదోతరగతి, ఇంటర్ వ రకు ఈ స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు.

సాగర్ కవచ్ నిర్వహణపై సమీక్ష



అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న పోలీస్ యంత్రాంగం

అచ్యుతాపురం : ఈ నెల 10,11వ తేదీల్లో సముద్ర తీరంలో నిర్వహించనున్న సాగర్‌కవచ్‌కు సంబంధించి మంగళవారం అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు సమీక్ష చేపట్టారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన సమీక్షలో భాగంగా పోలీసులు ముందస్తు ప్రణాళికలపై చర్చించారు. సముద్ర తీరంలోకి తీవ్రవాదులు వస్తే ఎలా ఎదుర్కోవాలి ?అనే అంశంపై ఈ సమీక్షలో అవగాహన కల్పించారు. సీఐ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత



గతుకులు పూడ్చుతున్న స్థానికులు

ఎస్.రాయవరం : మండల కేంద్రానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును పలువురు వాహన చోదకులు శ్రమదానంతో గతుకులు పూడ్చారు. ఈ రోడ్డు పి.ధర్మవరం సమీపంలో గతుకులు పడడంతో ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు తరచూ ఇబ్బందులు పడేవారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కొందరు శ్రమదానంతో గోతులు పూడ్చారు. దీంతో వాహన చోదకులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా నల్లమారమ్మ పండగ



నల్లమారమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఆటో యజమానులు

మునగపాక : మండల కేంద్రంలో మంగళవారం నల్లమారమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మునగపాకకు చెందిన ఆటో యజమానులు, డ్రైవర్లు ఉదయం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వరకు సందడి చేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కావాలన్నారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



మల్లవరంలో బ్లీచింగ్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ హేమలత



డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌వో దేవకాంత



ఖాజీపాలెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ సీజన్‌లో రోగాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత కోరారు. మండలంలోని మల్లవరంలో రోగాలు సంభవించకుండా మంగళవారం బ్లీచింగ్ పిచికారీ పనులను చేయించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మునగపాక:సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ప్రజలు ఉండాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత కోరారు. మునగపాకలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలల పాటు రోగాలు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పిచికారీ పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అలాగే 5 ఏళ్ల లోపు పిల్లలకు డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎం దేవకి, వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కళ్యాణి అన్నారు.మండలంలోని ఖాజీపాలెంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీ,అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డెంగ్యూ, అతిసార, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత, ఉమా మహేశ్ తదితర పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం

ఏపీటీఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వకార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. మంగళవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును ఆయన నక్కపల్లి మండలంలో పలు పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ కొండలరావు, ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, పూర్వగౌరవాధ్యక్షుడు సింహాచలం, నాయకులు అప్పలరాజు, కృష్ణ, సూర్యారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



జగన్నాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15వ తేదీన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

11న వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 11న వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరుగుతుందని తోసా(తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి.రావు ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్టు వీకేవీకే కళాధరావు ఆధ్వర్యంలో అదే రోజు యోగా–ఆరోగ్యంపై అవగాహన, అలాగే టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ ఉంటుందన్నారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించడంలో కృషి చేసిన హెచ్ఎం అప్పారావుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటప్పారావు కోరారు.

వచ్చే నెల 4న మోదమాంబ పండగ



మాడుగుల రూరల్: కె.జె.పురం ఆరాధ్య దేవత మోదమాంబ పండగ వచ్చే నెల 4వ తేదీన ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం కె.జె.పురం రామాలయంలో గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పండగ నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణ గురించి సమీక్షించారు. అనంతరం జాతర ఉత్సవ కమిటీని సభ్యులు ఆమోదంతో ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా భీశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా రాపేట రాజశేఖర్, కార్యదర్శిగా కాళ్ల హరిబాలతోపాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎంపీటీసీ -1 సభ్యురాలు చిన్నం లోవతల్లి దాలిబాబు, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, రాపేట జోగినాయుడు, శరగడం ఆదిబాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆడారి వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న ఆళ్ల ఉదయశ్రీ

మాడుగుల రూరల్: ఇటీవల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు ప్రతిభ పురస్కారాలు పొందారని కె.జె.పురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి. దాసు మంగళవారం తెలిపారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లిలో హోం మంత్రి అనిత, ఎంపీ సి.ఎం. రమేష్ నుంచి విద్యార్థిని ఆళ్ల ఉదయశ్రీ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 583 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మండల టాపర్‌గా నిలిచారు. ఈమెతోపాటు వీరనారాయణం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని రాపేట హేమశ్రీ(578), ఎం. కోడూరు జెడ్పీ పాఠశాలకు చెందిన ఎ. వసంత (574) ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచి పురస్కారాలు అందుకున్నారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గ్రామ ప్రజా ప్రతినిధులు అభినందించారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు



దొంకాడ గిరిజన గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్ తెలిపారు. మండలంలోని నల్లంకి, సుద్దలపాలెం, దొంకాడ గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మంది గిరిజనలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గిరి గ్రామాల్లో దోమలు అధికంగా ఉండటం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, దోమతెరలు వాడాలని సూచించారు. వైద్య సిబ్బంది ఇచ్చే ప్రతీ సలహా పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాణాగా మేలుజాతి పశుగ్రాసం

పాడేరు పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు నర్సింహులు



తునివలసలో పశుగ్రాస సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు



ఎం. కోటపాడులో పశుగ్రాస ముచ్చలను రైతులకు అందజేస్తున్న నర్సింహులు

మాడుగుల రూరల్: మేలుజాతి పశుగ్రాసాన్ని పాడి పశువులకు మేతగా వేయడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చునని పాడేరు పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు సి.హెచ్. నర్సింహులు తెలిపారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎం. కోటపాడు పశుగ్రాస క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ మేలు జాతి రకానికి చెందిన సూపర్ నేపియర్, రెడ్ నేపియర్ పశుగ్రాసం పాడి రైతులు తమ పశువులకు మేతగా వేయాలని సూచించారు.

పశువులు మేతకు సంబంధించి పశుగ్రాసం ముచ్చలను భూమిలో పాతుకోవాలన్నారు. వాటి ద్వారా పశుగ్రాసం పెరుగుతుందన్నారు. అనంతరం పశుగ్రాస ముచ్చలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కె.జె.పురం పశువైద్యాధికారి పి. మణిలక్షణ్, పశువైద్య సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

నర్సీపట్నం: పశుగ్రాసం విత్తనాలు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తుందని పశుసంవర్థక ప్రాంతీయ ఆస్పత్రి ఏడీ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పశుగ్రాసం పెంపకంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, మొక్కజొన్న, పిల్లి పెసర వంటి వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పశు గ్రాసాలను పెంచే విధానాలను రైతులు అలవర్చుకోవాలన్నారు. ఐదు నుంచి ఆరు లీటర్ల పాలిచ్చే పశువులకు దాణా అవసరం లేకుండా పచ్చిమేతతో పోషించవచ్చన్నారు. పచ్చిమేతలో విటమిన్ ఏ ఎక్కువగా ఉండటంతో పశువులు ఆరోగ్యంగా ఉండి సకాలంలో ఎదకు వచ్చి పాల దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. జొన్న రకాలను 50 శాతం పూతదశలో తప్పక కోయాలన్నారు. పాడి రైతులందరూ వినియోగించుకోవాలన్నారు.

పచ్చిమేతతో పశువులకు విటమిన్–ఏ : పశుగ్రాస వారోత్సవాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు: పచ్చిమేతను పశువులకు ఆహారంగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను పాడి రైతులు గుర్తించాలని కె.కోటపాడు పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం దాలివలస, కె.కోటపాడులో పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుసంవర్థక శాఖ ద్వారా 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు. పచ్చిమేత ద్వారా పశువులకు విటమిన్–ఏ లభిస్తుందన్నారు. తద్వారా పశువులకు మంచి ఆరోగ్యం, పాల దిగుబడి పెరగడంతోపాటు సకాలంలో ఎదకు వస్తుందని వివరించారు. కార్యక్రమంలో కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు, పశువైద్య సహాయకుడు కె.గోపి పాల్గొన్నారు.

పశుగ్రాస సాగుపై రైతులకు అవగాహన

చీడికాడ: పశుగ్రాసం సాగు ప్రాముఖ్యతపై ప్రతి పాడి రైతుకు అవగాహన అవసరమని పశుసంవర్థక శాఖ ఎ.డి చిట్టినాయుడు తెలిపారు. మంగళవారం తునివలసలో పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాసాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న రకాలు, రాయితీపై అందించే విత్తనాలపై అవగాహన కల్పించారు. పశు వైద్యశాలల్లో రాయితీపై అందించే కాకిజొన్న, అలసందలు, మొక్కజొన్న విత్తనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఖండివరం పశువైద్యాధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి : ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల నాయకుడు శివాజీ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళారం యలమంచిలి మండలం ములకలాపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 9 వారాల బకాయిలు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని వాటిని వెంటనే విడుదల చేయాలని, గతంలో వేసవి అలవెన్సు మహిళలకు గునపాం, పారకి తట్టకీ, మంచినీటికి నగదును కార్మికుల ఖాతాల్లో వేసేవారని ఇప్పుడు ఆ పద్ధతిని పూర్తిగా రద్దు చేశారని అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి నీడను ఏర్పాటు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలేవీ అందించడం లేదని ఆరోపించారు. గతంలో వారం వారం స్లిప్పులు ఇచ్చేవారని, 15 రోజులకు కూలీలకు పేమెంట్‌లు చెల్లించేవారని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి 200 రోజులుకు రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని అప్పట్లో డిమాండ్ చేయడం జరిగిందని, తమ పోరాట ఫలితంగా 300 రూపాయలు చెల్లిస్తున్నారని అన్నారు. మహిళలకు వేసవి అలవెన్సులు వెంటనే చెల్లించకపోతే ఎంపీడీవో కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. తొమ్మిది వారాల బకాయిలు చెల్లించి ఉపాధి హామీ కూలీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు సిఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నెలరోజులైనా అలాగే వదిలేశారు..



యండపల్లి శివారున కూలిన భారీ వృక్షం

కోటవురట్ల : ఆర్అండ్‌బీ రహదారుల్లో ఇటీవల కూలిన భారీ వృక్షాలను నెలల తరబడి తొలగించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తీరుపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యండపల్లి శివారున ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నాలుగు భారీ వృక్షాలు నెలరోజుల క్రితం కూలిపోయాయి. ఈ వృక్షాలను తొలగించకుండా అలాగే వదిలేయడంతో వాహనచోదకులు ఆదమరుపుగా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా ఎంతో విలువైన కలప ఎందుకూ కొరగాకుండా పోయే ప్రమాదం ఉంది. ఆర్అండ్‌బీ శాఖాధికారులు కూలిన వృక్షాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆశాజనకంగా నువ్వుపంట



పాములవాకలో పచ్చగా కళకళలాడుతున్న నువ్వుచేను

కోటవురట్ల : నువ్వుపంట సాగు ఆశాజనకంగా ఉంది. కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నువ్వుచేలు పచ్చగా కళకళలాడుతున్నాయి. మండలంలో నువ్వు పంట సుమారు 70 ఎకరాల్లో సాగులో ఉంది. మెట్ట ప్రాంతాల్లో అధికంగా సాగులో ఉండగా ఏపుగా పెరిగి పక్వానికి చేరుకుంటోంది. పాములవాక, నీలిగుంట, రామచంద్రపాలెం, బి.కె.పల్లి, పి.కె.పల్లి, చినబొడ్డేపల్లి, కె.వెంకటాపురం, లింగాపురం, తిమ్మాపురం, సన్యాసిరాజుపాలెం తదితర ప్రాంతాలలో నువ్వు పంట అధికంగా సాగులో ఉంది.

మస్తర్ల నమోదులో కొట్టివేతలు

- వీఆర్పీలపై డ్వామా ఏపీడీ రోజారాణి ఆగ్రహం
- రూ.15 వేల అపరాధ రుసుం విధింపు



ప్రజావేదికలో సోషల్ ఆడిట్ వివరాలను తెలుసుకుంటున్న అధికారులు

కె.కోటపాడు: మండలంలోని దాలివలస, గవరపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో వీఆర్పీల మస్తర్ల నమోదులో కొట్టివేతలపై డ్వామా అడిషనల్ పీడీ రోజారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి రూ.15 వేల అపరాధరుసుం విధించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి నిధులతో చేసిన పనులకు సంబంధించి 16వ విడత ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంతో వేతనదారులకు ఉపాధితోపాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.16 కోట్లతో 1,480 పనులు, పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.13.01 కోట్లతో 150 పనులు, రూ.8.96 లక్షలతో సోషల్ ఫారెస్ట్ పనులను గ్రామాల్లో చేపట్టారు. సామాజిక తనిఖీలో భాగంగా వీటి పరిశీలన, తనిఖీలను నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామసభల ద్వారా నివేదిక బహిర్గతం చేశామని ఎస్ఆర్పీ రాజేంద్రరావు తెలిపారు. ఉపాధి నిధులతో డి.అగ్రహారం, ఆర్.వై.అగ్రహారం , కె.జె.పురం, కె.సంతపాలెం, వి.సంతపాలెం, గొట్లాం, శృంగవరం గ్రామాల్లో 18 పనుల ప్రాంతాల వద్ద వివరాలతో కూడిన 18 బోర్డులు ఏర్పాటు చేయలేనట్లుగా డీఆర్పీలు ప్రజావేదికలో తెలిపారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ అనంతరం ఆయా గ్రామాల్లో 18 పనుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయించినట్లు వీఆర్పీలు ఫొటోలను అధికారులకు చూపించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, డీపీవో నిర్మలాదేవి, ఎంపీడీవో పట్నాయక్, ఏపీడీ శ్రీనివాస్, ఏపీవో అప్పలరాజు, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, లెక్కల దేవీలత, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, చీపురుపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, గొర్రుపోటు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు రక్తపరీక్షలు



వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రజని

చోడవరం: రావికమతం మండలంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రజని ఆధ్వర్యంలో మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు విజృంభిస్తుండటంతో ముందస్తుగా మలేరియా, డెంగ్యూపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 84 మంది విద్యార్థులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరికి ఎటువంటి మలేరియా లక్షణాలు లేవని రక్తపరీక్షల్లో తేలినట్లు వైద్యాధికారి తెలిపారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ ప్రబలింపజేసే దోమలు వృద్ధి చెందకుండా ముందస్తుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే ఆస్పత్రికి రావాలన్నారు. హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి పాతాళం రామారావు, హెచ్.ఎస్. రమణ, ఎ.ఎన్.ఎం. కన్నతల్లి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ, పోలమ్మ పండగ

కె.కోటపాడు: పొడుగుపాలెంలో పైడితల్లమ్మ, పోలమ్మ అమ్మవార్ల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల పండగ పర్వదినం కావడంతో పెద్ద ఎత్తున గ్రామస్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది.